క్లుప్తంగా

అనిల్‌కుమార్ యాదవ్‌కు పిడుగురాళ్లలో ఘన స్వాగతం



పిడుగురాళ్ల: వైఎస్సార్‌సీపీ నరసరావుపేట పార్లమెంట్ సమన్వయకర్త అనిల్‌కుమార్ యాదవ్ సోమవారం గురజాల నియోజకవర్గంలో అడుగుపెట్టడంతో పల్నాడు ప్రజలు ఘన స్వాగతం పలికారు. కొండమోడు నుంచి భారీ వాహనాలతో గురజాల నియోజకవర్గ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కారులు, బైకుల ర్యాలీతో ఘన స్వాగతం పలికారు. భారీ ర్యాలీతో గంగమ్మ తల్లి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా భారీ గజమాలతో అనిల్‌కుమార్ యాదవ్‌కు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

28న సత్రశాలలో సమీక్షా సమావేశం

రెంటచింతల: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని సత్రశాల వద్ద వేంచేసిన గంగా భ్రమరాంబ సమేత మల్లిఖార్జునస్వామి దేవస్థానంలో చేయవలసిన ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో ఈ నెల 28న సమీక్షా సమావేశం దేవస్థానంలో నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ ఎస్.రామ్‌మోహన్‌రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమీక్షా సమావేశంలో శాంతిభద్రతలు, వైద్య ఆరోగ్యం, రవాణా, విద్యుత్, పరిసరాల పరిశుభ్రత, వాహనాల పార్కింగ్ స్థలాన్ని పరిశీలించడం వంటి అంశాలపై దేవస్థానం ఈవో, చైర్మన్, వైస్ చైర్మన్, అధికారులతో, స్థానిక ప్రజాప్రతినిధులతో చర్చించనున్నట్లు తెలిపారు.

గిరిజన ఆశ్రమ పాఠశాలకు వాటర్ ప్లాంట్ వితరణ

విజయపురిసౌత్: మాచర్ల మండలం ఎత్తిపోతలలోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలకు అటవీ శాఖ మార్కాపురం డివిజన్ (వైల్డ్‌లైఫ్) అధికారులు ఆర్‌వో వాటర్ ప్లాంట్‌ను అందజేశారు. సోమవారం మార్కాపురం డీఎఫ్‌వో విగ్నేష్ అప్పావు పాఠశాలను సందర్శించి, వాటర్ ప్లాంట్‌ను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గిరిజన ఆశ్రమ పాఠశాలలో విద్యార్థినుల కోసం అటవీ శాఖ ఆధ్వర్యంలో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యార్థినులు కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించాలని కోరారు. అనంతరం పాఠశాల ప్రిన్సిపాల్ దుర్గాభవాని ఆధ్వర్యంలో డీఎఫ్‌వో విగ్నేష్ అప్పావును ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో విజయపురిసౌత్ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ టి.సత్యనారాయణ, సెక్షన్ ఆఫీసర్ వెంకట్రావు, బీట్ ఆఫీసర్ అబ్దుల్లా, పాఠశాల వార్డెన్ టి.వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు ప్రోత్సహించవద్దు

సీడీపీవో రుక్సానా సుల్తానా బేగం

గురజాల : బాల్యవివాహాలు ప్రోత్సహించడం చట్ట రీత్యా నేరమని సీడీపీవో రుక్సానా సుల్తానా బేగం అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం సాయంత్రం బేటీ బచావో.. బేటీ పఢావో కార్యక్రమంలో భాగంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వివాహానికి ఆడపిల్లలకు 18 సంవత్సరాలు మగ పిల్లలకు 21 సంవత్సరాలు నిండాలన్నారు. చిన్న తనంలో వివాహాలు చేయడం వలన ఎన్నో అనర్థాలు జరుగుతాయన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, మెడికల్ సిబ్బంది, పోలీస్ శాఖ వారు బాల్య వివాహాలు జరిగినట్లు సమాచారం ఉంటే వెంటనే మా దృష్టికి తీసుకురావాలన్నారు. ఆడపిల్లలు చట్టాల గురించి తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఏపీఎం అమర్, న్యాయవాది జ్ఞాన సుందరి, సూపర్‌వైజర్ వై.త్నకుమారి, అరుణ శ్రీ, శ్రీలక్ష్మి తదితరులున్నారు.

నేడు మున్సిపల్ సమావేశం

పిడుగురాళ్ల : పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం మున్సిపల్ సమావేశం నిర్వహించనున్నట్లు మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు సోమవారం తెలిపారు. ఈ సమావేశం ఉదయం 11 గంటలకు ప్రారంభం అవుతుందన్నారు. కౌన్సిల్ సభ్యులు అందరూ సమావేశానికి హాజరుకావాలన్నారు.

ఆర్థిక అక్షరాస్యతా కేంద్రం ప్రారంభం

కారెంపూడి: బ్యాంకు సేవల పట్ల అలాగే ప్రభుత్వ పథకాల పట్ల ప్రజలు పూర్తి అవగాహన కలిగి ఉన్నప్పుడే ప్రభుత్వ స్కీమ్‌లు సమర్థవంతంగా ఉపయోగించుకోగలుగుతారని యూనియన్ బ్యాంక్ చీఫ్ మేనేజర్ ప్రకాశరావు పేర్కొన్నారు. ఆర్‌బీఐ మార్గదర్శకాల ప్రకారం కారెంపూడిలో సోమవారం రాత్రి ఆర్థిక అక్షరాస్యతా కేంద్రాన్ని ఎంపీపీ సావిత్రిఅల్లయ్య చేతుల మీదుగా ప్రారంభింపచేశారు. వెల్దుర్తి, కారెంపూడి, రాజుపాలెం మండలాల ప్రజలకు బ్యాంకుల సేవల పట్ల అవగాహన పెంచడం కోసం ఈ కేంద్రాన్ని వివిధ బ్యాంకుల అధికారులు ప్రారంభించారు. ఎల్‌డీఎం రాంప్రసాద్, యూనియన్ బ్యాంక్ మేనేజర్ భాస్కర్, ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ ఏడుకొండలు, చైతన్య గోదావరి బ్యాంక్ కారెంపూడి, ఒప్పిచర్ల శాఖల మేనేజర్లు కొండారెడ్డి, రవి, వెలుగు ఏపీఎం శివకుమార్ పాల్గొన్నారు.

అభివృద్ధికి చిరునామా పిన్నెల్లి

నాడు

1973లో పిడుగురాళ్ల సమితి పరిధిలోని పిన్నెల్లి గ్రామానికి పంచాయతీ కార్యాలయం నిర్మించారు. శిథిలావస్థకు చేరి, ప్రమాదకరంగా మారిన పట్టించుకున్న దాఖలాలు లేవు. ప్రభుత్వ పాఠశాలల పరిస్థితీ అంతంత మాత్రంగానే ఉండేది. అధిక జనాభా ఉన్నా ఒక్క ఆరోగ్య కేంద్రం ఉండేది కాదు. ఏ పార్టీ అధికారంలోకి వస్తే ఆ పార్టీ వారికి చెందిన వీధులు మాత్రమే సీసీ రోడ్లు కనిపించేవి. కేవలం జన్మభూమి కమిటీ సిఫారసుల మేరకు మాత్రమే సంక్షేమ పథకాలు అందేవి. విద్యార్థులు, రైతులు ఇలా ఎవరైనా ఏ ధ్రువీకరణ పత్రం కావాలన్నా మండల కేంద్రానికి వెళ్లాల్సిన దుస్థితి. ఇలాంటి పరిస్థితులు మారాలంటే మంచి నాయకుడు, మంచి పాలన రావాలని ప్రజలు ఆకాంక్షించారు.

నేడు

2019లో అధికారం చేపట్టిన తర్వాత ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా పాలనకు విప్లవాత్మకమైన మార్పులకు నాంది పలికారు. ఇచ్చిన హామీల మేరకు నవరత్నాల పథకాల ద్వారా ప్రజల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ ప్రజా పాలన అందిస్తున్న ప్రభుత్వంగా మన్ననలు పొందారు. గ్రామ స్వరాజ్యమే లక్ష్యంగా గ్రామాల అభివృద్ధి, పాలనా సౌలభ్యం కాంక్షిస్తూ పనులు చేపట్టి మౌలిక సదుపాయాలు కల్పించారు. నేడు ప్రతి గడపలో లబ్ధిదారులు ఉన్నారనేది వాస్తవం. వలంటీర్ వ్యవస్థతో క్షేత్రస్థాయిలో అర్హులను గుర్తించి ప్రతి గడపకూ సంక్షేమాన్ని అందిస్తున్నారు.

- నవరత్నాల పథకాల ద్వారా రూ.51.92 కోట్లు సంక్షేమం
- రూ.8.37 కోట్లతో అభివృద్ధి పనులు
- గ్రామ పంచాయతీ, మండల గ్రాంటులతో మరో రూ.90 లక్షలు



గ్రామ సచివాలయం



రైతు భరోసా కేంద్రం

మాచవరం: 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల మేనిఫెస్టోను పవిత్రంగా భావించి కుల, మత, వర్గ, రాజకీయాలకు అతీతంగా ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికి అందజేస్తూ ఏపీ రాజకీయ చరిత్రలో వినూత్న విప్లవం సృష్టించారు. ప్రజలకు అందిస్తున్న పలు సంక్షేమ పథకాలను ఇతర రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకొని అమలు చేసేందుకు ముందుకు వస్తున్నాయి. గ్రామాల్లో జరిగిన సంక్షేమం, అభివృద్ధిని చూసి ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



బీసీ కాలనీలో నిర్మించిన సీసీ రోడ్డు



హెల్త్ క్లినిక్ సెంటర్

గ్రామంలో 2019 తర్వాత సంక్షేమం ఇలా..

- ఆసరా ద్వారా రూ.3,81,08,480
- అమ్మ ఒడి ద్వారా రూ.5,89,44,831
- క్రాప్ ఇన్సూరెన్సు రూ.1,06,38,087
- జగనన్న విద్యా దీవెన రూ.1,35,60,083
- వైఎస్సార్ చేయూత రూ.2,81,43,750
- వైఎస్సార్ ఆరోగ్యశ్రీ రూ.2,07,13,481
- పెన్షన్లు రూ.13,08,01,750
- రైతు భరోసా రూ.8,03,69,400

మొత్తం వివిధ సంక్షేమ పథకాల ద్వారా రూ.51.92 కోట్లు అందించారు.



గిడ్డంగి

గ్రామాభివృద్ధికి చేపట్టిన కార్యక్రమాలు ఇలా..

వివిధ ప్రభుత్వ శాఖల ద్వారా సీసీ రోడ్ల నిర్మాణాలకు రూ.2.26 కోట్లు
ప్రభుత్వ భవనాలకు రూ.1.58 కోట్లు
నాడు–నేడు ద్వారా రూ.1.49 కోట్లు
జలజీవన్ మిషన్ ద్వారా రూ.1.63 కోట్లు
ఇతరత్రా పనులకు రూ.90 లక్షలు
మొత్తం రూ.8,36,90,000 అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగింది.
ఇవే కాక మండల గ్రాంటు ద్వారా రూ.25 లక్షలతో సీసీ రోడ్లు, అంతర్గత రోడ్లు
పంచాయతీ నిధులు సీసీ రోడ్లకు రూ.40 లక్షలు, రూ.35 లక్షలతో తాగునీటి పనులు చేపట్టారు.

జగనన్న పాలన భేష్..



జగనన్న పాలనలో ప్రజలందరికి మేలు జరిగింది. ప్రతి గడపకు ప్రభుత్వ పథకాలు అందాయి. గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు ఎన్నో జరిగాయి. ప్రభుత్వ కార్యాలయాలు అందుబాటులో ఉండడంతో పనులు వేగంగా జరుగుతున్నాయి.

\- అమరావతి బుజ్జి

మహిళలకు జగనన్న అండగా నిలిచారు..



ప్రభుత్వం అందించే అనేక ప్రభుత్వ పథకాలు నేడు మహిళల పేరుతోనే అందుతున్నాయి. అమ్మఒడి, ఆసరా, ఇళ్ల పట్టాలు, చేయూత, కాపు నేస్తం లాంటి పథకాలతో మహిళలకు భరోసా కల్పించారు. మహిళా సాధికారతకు బాసటగా నిలిచారు.

\- పుణ్యాల సావిత్రి

అందుబాటులోనే మందులు ..



గతంలో ఆరోగ్యం సరిగా లేక పోతే మాచవరం ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లాల్సి వచ్చేది. మందులు తెచ్చుకోవాలంటే ఇబ్బందులు పడే వాళ్లం. ఇప్పుడు మాకు దగ్గర్లోనే ఆరోగ్య కేంద్రంలో మందులు అందుతున్నాయి. వ్యయ ప్రయాసటు తప్పాయి. చాలా సంతోషంగా ఉంది.

\- అన్నారపు కోటేశ్వరమ్మ

వైఎస్సార్‌సీపీలో చేరిన బీసీ సంక్షేమ సంఘం నాయకులు



పార్టీలో చేరిన వారితో మాజీ మంత్రి అనిల్‌కుమార్, ప్రభుత్వ విప్ పీఆర్కే, పీవీఆర్

మాచర్ల: రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ఎంతో మేలు చేస్తూ పేద వర్గాలకు అండగా నిలుస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పథకాలకు ఆకర్షితులై నియోజకవర్గానికి చెందిన బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు కొర్రపాటి మల్లిఖార్జునరావు యాదవ్ ఆధ్వర్యంలో 25 కుటుంబాలు వైఎస్సార్‌సీపీ నరసరావుపేట పార్లమెంట్ అభ్యర్థి పోలుబోయిన అనిల్‌కుమార్ యాదవ్, పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డిల సమక్షంలో చేరాయి. సోమవారం వైఎస్సార్‌సీపీ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో 25 మంది బీసీ సంక్షేమ సంఘ నాయకులు తమ అనుచరులతో కలిసి వచ్చి సామాజిక న్యాయం చేస్తున్న సీఎం జగన్‌కు జేజేలు పలుకుతూ మాజీ మంత్రి అనిల్‌కుమార్, ప్రభుత్వ విప్ పీఆర్కేల ఆధ్వర్యంలో పార్టీలో చేరినట్లు చెప్పారు. ఈ సందర్భంగా వారినుద్దేశించి మాజీ మంత్రి అనిల్‌కుమార్, ప్రభుత్వ విప్ పీఆర్కే, పీవీఆర్‌లు మాట్లాడుతూ రాష్ట్రంలో రాబోయే రోజుల్లోనూ పేదలకు, సామాజిక వర్గాలకు సమ న్యాయం చేసే వ్యక్తి సీఎం జగన్ అని గుర్తించి ఆయనకు అన్ని వర్గాలు మద్దతు పలకాలన్నారు. పార్టీలో చేరిన బీసీ నాయకులను సాదరంగా ఆహ్వానించి పార్టీ కండువా కప్పి అభినందించారు. పలువురు బీసీ నాయకులు పాల్గొన్నారు.

పిడుగురాళ్లలో మున్సిపల్ కార్యాలయం ప్రారంభం

పిడుగురాళ్ల: పిడుగురాళ్ల పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయ సమీపంలో నూతనంగా నిర్మించిన మున్సిపల్ కార్యాలయాన్ని ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, రాజ్యసభ సభ్యులు అయోధ్య రామిరెడ్డి, ఎమ్మెల్సీ ఏసురత్నం, పార్లమెంట్ సమన్వయ కర్త అనిల్‌కుమార్ యాదవ్‌లు రిబ్బన్ కట్ చేసి భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి మాట్లాడుతూ 15 ఏళ్ల క్రితం గ్రామ పంచాయతీగా ఉన్న పిడుగురాళ్లను మున్సిపాలిటీగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో చేసారన్నారు. అయితే పంచాయతీలో ఉన్న భవనం మున్సిపాలిటీగా చేయటంతో అధికారుల విధుల నిర్వహణకు, ప్రజల రాకపోకలకు అసౌకర్యంగా ఉండడంతో తక్షణమే ప్రజలకు మున్సిపల్ సేవలు అందించేందుకు నూతన భవనాన్ని నిర్మించేందుకు ఆర్ అండ్ బీ స్థలాన్ని మున్సిపాలిటీకి బదిలీ చేయించి నూతన కార్యాలయం నిర్మించటం జరిగిందన్నారు. పట్టణంలో ప్రజలు తాగేందుకు శుద్ధి చేసిన నీటిని అందించలేకపోయారు. ప్రజలు కలుషితమైన బోర్లలోని నీటిని తాగే పరిస్థితిని గత పాలకులు కల్పించారు. గతంలో కనీసం ఒక హాస్పిటల్ కూడా పిడుగురాళ్ల పట్టణంలో లేదు. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత పిడుగురాళ్ల పట్టణంలో శుద్ధి చేసిన నీటిని ఇంటింటికీ అందిస్తున్నామన్నారు. మూడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ప్రారంభించామని తెలిపారు. అలాగే రహదారులు వెడల్పు చేసి ప్రజల రాకపోకలకు సౌకర్యాలు కల్పించామన్నారు. నేడు మున్సిపల్ కార్యాలయం పిడుగురాళ్ల పురప్రజలకు అంకితం చేయటం జరిగిందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ టీజీవీ కృష్ణారెడ్డి, మురళీధర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు, పల్నాడు జిల్లా ముస్లిం మైనార్టీ అధ్యక్షులు ఎండీ గఫార్, వైస్ చైర్మన్ కొమ్ము ముక్కంటి, కేవీ, ఎంపీపీ అల్లు పిచ్చిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ వీరభద్రునిరామిరెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



మున్సిపల్ కార్యాలయం ప్రారంభంలో ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి తదితరులు

శ్మశానవాటికలో గది ప్రారంభం

పిడుగురాళ్ల రూరల్: మండలంలోని కోనంకి గ్రామంలో గ్రామానికి చెందిన ఏపీ రెరా ఇన్‌చార్జి చైర్మన్ ఈదా రాజశేఖర్‌రెడ్డి తల్లి సైదమ్మ జ్ఞాపకార్థం శ్మశాన వాటికలో రూ.3.50 లక్షలతో నిర్మించిన గదిని సోమవారం ప్రారంభించారు. దాత రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు జన్మనిచ్చిన గ్రామ అభివృద్ధికి ఏదో ఒక కార్యక్రమం ద్వారా తమ వంతు కృషి చేస్తే గ్రామ రుణం తీర్చుకున్నట్లు ఉంటుందని అన్నారు. స్థానిక జెడ్పీ పాఠశాలను సందర్శించారు. ఉపాధ్యాయుల కోరిక మేరకు పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని చెప్పారు. గ్రామ పెద్దలు సుబ్బారెడ్డి, మాజీ మార్కెట్ డైరెక్టర్ తిరుపతిరెడ్డి, అంజిరెడ్డి పాల్గొన్నారు.

జాతీయ నాయకుల విగ్రహాల ఆవిష్కరణ



బాబు జగజ్జీవన్‌రావు విగ్రహం



జ్యోతిరావుపూలే విగ్రహం



వంగవీటి రంగా విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, కాపు నాయకులు

పిడుగురాళ్ల: పిడుగురాళ్ల పట్టణంలో జాతీయ నాయకుల విగ్రహాలను సోమవారం గురజాల నియోజకవర్గ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నరసరావుపేట పార్లమెంట్ అభ్యర్థి అనిల్‌కుమార్‌యాదవ్‌లు ముఖ్యఅతిథులుగా హాజరై విగ్రహాలను ప్రారంభించారు. ముందుగా పట్టణంలోని మన్నెం పుల్లారెడ్డి హైస్కూల్ ఎదురుగా ఉన్న అబ్దుల్ కలాం విగ్రహం, ఆర్ అండ్ బీ బంగ్లా వద్ద జ్యోతిరావు పూలే, పిల్లుట్ల రోడ్డులో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వీర వనిత చిట్యాల ఐలమ్మ విగ్రహం, పోలీస్ స్టేషన్ సెంటర్‌లో బాబు జగజ్జీవన్‌రావ్ విగ్రహాలను వారు ప్రారంభించారు. అలాగే ఆంధ్రాబ్యాంక్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన వంగవీటి మోహన్‌రంగా కాంస్య విగ్రహాన్ని ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కొత్త సుబ్బారావు, వైస్ చైర్మన్ ముక్కంటి, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు గఫార్, బీసీ నాయకులు గురవాచారి, కో ఆప్షన్ సభ్యులు శెట్టుపల్లి, సుధీర్, ఆనంద్, సుందరరావు, జాషువా, స్వామి, ప్రేమ్‌రాజు, నారాయణ, మోహన్‌రావు, గంగయ్య, నాంచారయ్య, నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

బోదిలవీడులో కల్యాణ మండపం ప్రారంభం

- అభివృద్ధి పనులు ప్రారంభించిన ప్రభుత్వ విప్ పీఆర్కే
- స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసిన ప్రభుత్వ విప్ పీఆర్కే



బోదిలవీడులో కల్యాణ మండప శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రభుత్వ విప్ పీఆర్కే

వెల్దుర్తి: మండలంలోని బోదిలవీడు గ్రామంలో శ్రీలక్ష్మీ పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి వారి కల్యాణ మండపాన్ని పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోదిలవీడు గ్రామ అభివృద్ధి కోసం తాను ఎంతో కృషి చేశానన్నారు. కల్యాణ మండప నిర్మాణానికి రూ.40 లక్షలు, సిమెంట్ రోడ్డు నిర్మాణానికి రూ.20 లక్షల నిధులను మంజూరు చేయటం జరిగిందన్నారు. గ్రామస్తులందరూ ఐకమత్యంగా గ్రామాభివృద్ధికి కృషి చేయటం ఆనందదాయకమన్నారు. మండలంలో చిన్న గ్రామమైనప్పటికీ గ్రామస్తులంతా కల్యాణ మండప నిర్మాణానికి సహకరించటం హర్షణీయమన్నారు. డీఎంఎఫ్ శాఖ నుంచి కల్యాణ మండపానికి రూ.40 లక్షల నిధులను గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా రూ.20 లక్షల నిధులను మంజూరు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పంగులూరి లక్ష్మయ్య, ఎంపీటీసీ మేదరమెట్ల పార్వతమ్మ, కండ్లకుంట సొసైటీ మాజీ అధ్యక్షుడు గాలి వెంకటేశ్వర్లు, మండలపు మల్లిఖార్జునరావు, గుండపనేని కృష్ణమూర్తి, అద్దలపూడి కృష్ణమూర్తి, పంగులూరి బాబురావు, నంబూరి కృష్ణమూర్తి, పంచాయతీరాజ్ డీఈ పాశం శ్రీనివాసరెడ్డి, సూపరింటెండెంట్ డి.ప్రసాద్, తదితరులున్నారు.

ఘనంగా శ్రీలక్ష్మీ పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి 24వ వార్షికోత్సవం..

మండలంలోని బోదిలవీడు గ్రామంలో వేంచేసియున్న శ్రీలక్ష్మీ పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి వారి 24వ వార్షికోత్సవాన్ని సోమవారం గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 10 గంటలకు స్వామి వారి కల్యాణాన్ని అర్చకులు సుబ్రహ్మణ్యం, గోపిల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. స్వామి వారి ఉత్సవ విగ్రహాలను గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మహిళల కోలాటం చూపరులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.



ధ్వజస్తంభం వద్ద ప్రభుత్వ విప్ పీఆర్కే

ఆయిల్‌పామ్ సాగుకు నీరు కీలకం

సీనియర్ శాస్త్రవేత్త మాధవీలత



రైతులకు ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన కల్పిస్తున్న సీనియర్ శాస్త్రవేత్త మాధవీలత

రెంటచింతల: ఆయిల్‌పామ్ సాగు చేయడానికి భూమిలో సమపాళ్లలో సూక్ష్మపోషకాలతో పాటు సాగునీరు వసతి ఎంతో కీలకమని డాక్టర్ వైఎస్సార్ హార్టికల్చర్ యూనివర్సిటీ పరిధిలోని హార్టికల్చర్ రీసెర్చ్ స్టేషన్ సీనియర్ శాస్త్రవేత్త పి.మాధవీలత అన్నారు. పల్నాడు జిల్లాలో ఆయిల్ పామ్ సాగుకు అనుకూలమైన భూముల సర్వేలో భాగంగా సోమవారం రెంటచింతల పరిసరాలలోని సాగు భూములను ఆమె ఉద్యాన అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం స్థానిక రైతు భరోసా కేంద్రంలో రైతులకు ఆయిల్‌పామ్ సాగుపై ఏర్పాటు చేసిన అవగాహన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆయిల్‌పామ్ సాగుకు ప్రతి రోజు ఒక మొక్కకు 250 లీటర్ల నీరు అవసరమన్నారు. ఒక ఎకరాకు సుమారు 48 నుంచి 57 మొక్కలు నాటడానికి అవకాశం ఉంటుందన్నారు. ఎకరంలో నాటిన మొక్కలకు ఒక రోజుకు సుమారు 14,250 లీటర్ల సాగునీరు అవసరం ఉంటుందన్నారు. ఉద్యాన అధికారుల సలహాల మేరకు నీటి వసతి ఉన్న భూములలో మాత్రమే ఆయిల్‌పామ్ సాగు చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో గురజాల ఉద్యాన అధికారి వై.మోహన్, మాచర్ల ఉద్యాన అధికారి ఎన్.సురేష్, వైస్ ఎంపీపీ ఏరువ శౌర్రెడ్డి, ఆర్బీకే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత విద్య దరఖాస్తులకు ఆహ్వానం

కారెంపూడి: దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న పేద విద్యార్థులు 25 శాతం మంది ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత విద్య అభ్యసించేందుకు విద్యాహక్కు చట్టం 2009 సెక్షన్ 1టు1సీ ద్వారా వీలు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని కారెంపూడి 1 ఎంఈవో కె.కాంతారావు, కారెంపూడి 2 ఎంఈవో టి.రవికుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024–25 విద్యా సంవత్సరంలో ఒకటవ తరగతిలో చేరేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. విద్యార్థులు ఏప్రిల్ 2, 2017 నుంచి మే 31, 2018 మధ్య జన్మించిన వారై ఉండాలని, ఆధార్, తెల్ల రేషన్ కార్డు, కులం, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో పాటు ఫొటో కూడా దరఖాస్తుకు జత చేయాలని పేర్కొన్నారు. తమకు దగ్గరలోని ప్రైవేటు పాఠశాలలో స్టేట్, సీబీఎస్ఈ సిలబస్‌లలో చదువుకునే అవకాశం ఉందని, అదనపు సమాచారం కోసం దగ్గరలోని ఎంఈవో కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. ఎస్సీలకు 10 శాతం, ఎస్టీలకు 4 శాతం, బీసీ, మైనార్టీలకు 6 శాతం, మిగిలినవి అనాథలు, విభిన్న ప్రతిభావంతులు, హెచ్ఐవీ బాధితుల పిల్లలకు కేటాయించడం జరిగిందని వివరించారు. అర్హత కలిగిన వారు ఫిబ్రవరి 23 నుంచి మార్చి 2వ తేదీ లోపు దరఖాస్తులు సమర్పించాలని తెలిపారు.

ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి మృతి

గురజాల: ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన సోమవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని సమాధానంపేటకు చెందిన మహంకాళీ ఏసురాజు (43) ట్రాక్టర్ డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం సాయంత్రం గొట్టిముక్కల శివారు కొత్తకుంట నుంచి కె.ముత్తయ్య పొలానికి మట్టి తోలుతున్నాడు. ఆదివారం అర్ధరాత్రి 12.30 గంటలకు ఏసురాజుకు నిద్ర రావడంతో కుంట పక్కన ఉన్న మర్రిచెట్టు వద్ద నిద్రించాడు. సమాధానంపేటకు చెందిన మరో డ్రైవర్ పాశం అజయ్‌కుమార్ ట్రాక్టర్‌ను అజాగ్రత్తగా నడిపి చెట్టుకింద ఉన్న ఏసురాజును ఢీకొట్టాడు. అటుగా వస్తున్న ట్రాక్టర్ డ్రైవర్‌లు చూసి ఏసురాజు కుమారుడు మనోహర్‌కు సమాచారం ఇవ్వగా వెంటనే క్షతగాత్రుడిని గురజాల సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. వైద్యులు పరీక్షలు నిర్వహించి అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. మృతుడి కుమారుడు మనోహర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య ఇద్దరు సంతానం కలరు.